
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 3 । మార్చి । 2025



	ఇఫ్తార్ సోమ॥ (సా॥)	సహర్ మంగళ॥ (ఉ॥)
కడప	: 6.29	5.14
పులివెందుల	: 6.31	5.19
ప్రొద్దుటూరు	: 6.30	5.18

రంజాన్ వేళలు



అధికారం అండతో ప్రభుత్వ స్థలం కబ్జా

టీడీపీ నేతల అండతో కడప నగరంలో కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు. నిరంజన్ నగర్ పరిధిలో ప్రభుత్వ నీటి మునక భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.5/20.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం 20.2 - 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలిపారు. ప్రజలు 08562 -244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

13న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్: తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంకు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 13న స్పెషల్ సర్వీసును నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బద్వేలులో ఉదయం 9 గంటలకు బయలుదేరే సర్వీసు రాను, పోను కలిపి రూ.1250గా నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. ఈ బస్సు కడపకు ఉదయం 10.30 గంటలకు చేరుతుందన్నారు. కడప నుంచి రూ.1150, రాయచోటి బంగ్లా వద్దకు 11.45 గంటలకు చేరుతుందని, అక్కడి నుంచి రాను, పోను రూ.1050గా చార్జీ ఉంటుందన్నారు. మూడు స్టాంపింగ్‌లో ఈ బస్సు ఆగుతుందన్నారు. రిజర్వేషన్ల కోసం (సర్వీసు నంబర్: 9569) ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో అరుణాచలం అని టైప్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఫోన్ ద్వారా (8886090136) కూడా చార్జీని చెల్లించే అవకాశం ఉందన్నారు.

నూతన కమిటీ



డీఎస్సీ ఫోరం జిల్లా నాయకులు

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ-2003 ఫోరం రాష్ట్ర స్థాయి నాయకత్వానికి అనుబంధంగా వైఎస్సార్ జిల్లా నూతన ఫోరంను ఎన్నుకున్నారు. ఆదివారం కడపలోని జిల్లా పరిషత్ ఆవరణలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షుడిగా గుజ్జల తిరుపాల్, ప్రధాన కార్యదర్శిగా కావేటి ఉదయ్‌భాస్కర్, ట్రెజరర్‌గా కురుకూటి సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా మిద్దె ప్రవీణ్‌కిరణ్, బండి నాగేశ్వరరెడ్డి, కందుకూరు వీరప్రతాప్, మహిళా కార్యదర్శులుగా సునీత, సుమలత, కరీమున్నీసా, సునీతాను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు గుజ్జల తిరుపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 5 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా రాష్ట్రంలో దాదాపు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు ఓపీఎస్ సాధించడమే ధ్యేయంగా 2003 డీఎస్సీ ఫోరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జీబీఎస్ కలవరం

'గులియన్ బ్యారో సిండ్రోమ్' (జీబీఎస్) అరుదైన ఈ వ్యాధి గుబులు రేపుతోంది. ఇటీవల కాలంలో ఈ కేసులు వెలుగు చూడటం కలవరం కలిగిస్తోంది. పొరుగున ఉన్న నెల్లూరుతోపాటు గుంటూరు తదితర జిల్లాల్లో ఈ వ్యాధి చాపకింద నీరులా పాకుతోంది. తాజాగా కర్నూలు జిల్లాలో బయటపడింది. నాడీ వ్యవస్థను విచ్ఛిన్నం చేసి.. మనిషిని నిలువెల్లా కట్టి పడేసే 'జీబీఎస్' వ్యాధి తారెత్తిస్తోంది. ఇది అంటు వ్యాధి కాదు.. ముందస్తు జాగ్రత్తలతోనే ఈ అడ్డుకట్ట వేయవచ్చు.





- నాడీ వ్యవస్థను దెబ్బతీసే వ్యాధి
- ఏదైనా జబ్బు వచ్చి వెళ్లిన తరువాత.. బయటపడుతున్న లక్షణాలు
- అప్రమత్తంగా లేకుంటే ఆపదలో పడినట్లే
- ఈ కేసులు జిల్లాలో ఎక్కడా లేవంటున్న వైద్య ఆరోగ్య శాఖ

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా జ్వరం.. జలుబు.. దగ్గు.. ఒళ్లు నొప్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో 'జీబీఎస్' వ్యాధి కలవరం రేపుతోంది. ఎందుకంటే విరేచనాలు, జ్వరం తదితర జబ్బులు వచ్చి వెళ్లిన తరువాతనే.. ఒళ్లు నొప్పులతో ప్రధానంగా కాళ్ల నొప్పులతో ఈ 'జీబీఎస్' వ్యాధి ప్రారంభమవుతుంది. ఈ లక్షణాలను ముందస్తుగానే తెలుసుకొని చికిత్స పొందితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. పొరపాటున అప్రమత్తంగా లేకుంటే మాత్రం పెద్ద ప్రమాదాన్నే ఎదుర్కోవాల్సి ఉంటుంది.


జాగ్రత్తలతోనే అడ్డుకట్ట

ఈ వ్యాధి అంటు వ్యాధి కాకపోవడం శుభపరిణామం. కాగా ముందస్తు జాగ్రత్తలతోనే ఈ అరుదైన వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చు. అంటే ఇతరుల నుంచి సంక్రమించే డయేరియా, జ్వరం, దగ్గు తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. ప్రధానంగా ఈ వ్యాధి ఎందుకొస్తుందో తెలుసుకోవాలి.. అవగాహన పెంచుకోవాలి. ఏదైనా జబ్బు వచ్చి వెళ్లిన తరువాత శరీరంలో ఏదైనా మార్పు వచ్చినా.. ప్రధానంగా నరాలు, కండరాలకు సంబంధించిన సమస్యలను గుర్తిస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పూణెలో నిర్ధారణ పరీక్షలు

ప్రస్తుతం ఈ వ్యాధి రాష్ట్రంతోపాటు దేశ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. కాగా జిల్లాకు సంబంధించి ఏ పెద్ద జబ్బొచ్చినా పెద్దాసుపత్రి (కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి)కి వెళ్లాల్సిందే. గత ప్రభుత్వ పాలనలో కరోనా వచ్చినప్పుడు యుద్ధ ప్రాతిపదికన అందుకు అవసరమైన వైద్య పరికరాలు, మందులు, సిబ్బందిని సిద్ధం చేశారు. ఫలితంగా కరోనాపై విజయం సాధించాం. తాజాగా 'జీబీఎస్' వ్యాధి సవాల్ విసురుతోంది. అయితే ఇక్కడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మాత్రం ఈ వ్యాధి నిర్ధారణకు ఎలాంటి పరికరాలు అందుబాటులో లేవు. అనుమానిత కేసులు ఏవైనా ఉంటే పూణేలోని ల్యాబొరేటరీకి పంపి వ్యాధిని నిర్ధారిస్తారని వైద్యులు చెబుతున్నారు. ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించాల్సి వుంది. ఈ పరీక్షలకు సంబంధించి కడప పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా నిధులను కేటాయించి పరికరాలను సిద్ధం చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

'జీబీఎస్' అంటే..



శరీరంలో ఏదైనా వ్యాధికి కారణమైన ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు.. దాన్ని ఎదుర్కోవడానికి శరీరంలో ఇమ్యూనిటీ యాక్టివేట్ అవుతుంది. కొన్ని సందర్భాల్లో ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన బ్యాక్టీరియాను నిర్మూలించాల్సి ఉండగా.. మన నరాల (నాడీ వ్యవస్థ)పైనే దాడి చేయడం ప్రారంభిస్తుంది. దీన్నే 'ఆటో ఇమ్యూనిటీ' అంటారు. అంటే మన ఇమ్యూనిటీనే నాడీ వ్యవస్థపై దాడి చేసి మన శరీరాన్ని నిర్వీర్యం చేస్తుంది. దీనినే 'జీబీఎస్' అంటారు. విరేచనాలు, జ్వరం ఇలా ఏదైనా జబ్బు వచ్చి వెళ్లిన తరువాత ఈ వ్యాధి లక్షణాలు వెలుగు చూస్తాయి. మొదట నడు కింది భాగం కాళ్లలో తిమ్మిర్లు, నొప్పులు, నీరసం తదితర లక్షణాలు కనిపిస్తాయి. అనంతరం క్రమేణా శరీరంలోని ఇతర భాగాలపై ప్రభావం చూపిస్తుంది. ఈ జబ్బు శరీరంలోని అన్ని భాగాలపై ప్రభావం చూపిస్తుంది. పక్షవాతం కూడా వస్తుంది. అయితే ప్రారంభంలోనే ఈ వ్యాధి లక్షణాలను గమనించి వైద్య చికిత్స పొందితే ఎలాంటి అనర్థం ఉండదు. చికిత్సలో భాగంగా వెంటిలేటర్ దశకు వెళ్లక ముందే చికిత్స పొందితే చాలా మంచిదని వైద్యులు అంటున్నారు.

ఖరీదైన వ్యాధికి ఆరోగ్యశ్రీలో రూ.80 వేలే

ఇది ఖరీదైన వ్యాధి. ఈ వ్యాధి సోకిన వారికి గ్లోబులిన్ ఇంజెక్షన్‌లు మోతాదు ప్రకారం వాడాలి. ఒక గ్రాము ధర రూ.12 వేల వరకు ఉంటుంది. ఒక రోజుకు 4–5 గ్రాముల ఇంజెక్షన్ ఇవ్వాల్సి వుంటుంది. అత్యవసరమైన వారికి ప్లాస్మాపెరోసిస్ చికిత్సను అందించాలి. ఈ చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. కాగా ఆరోగ్యశ్రీలో మాత్రం ఈ వ్యాధికి రూ.80 వేల వరకు మాత్రమే ప్యాకేజీ ఉంది. పేదలు ఆరోగ్యశ్రీ ద్వారా ఈ వ్యాధికి చికిత్స పొందాలంటే కష్టతరం అవుతుంది. గత పాలనలో కరోనాను ఆరోగ్యశ్రీ కిందికి చేర్చి ఉచితంగా వైద్య చికిత్సను అందించారు. తాజాగా ఈ 'జీబీఎస్' వ్యాధికి ఆరోగ్యశ్రీ కింద ప్యాకేజీని పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

అవగాహన అవసరం

ఈ వ్యాధి మనకు లేదని, అజాగ్రత్తగా ఉండటం కంటే ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షల పరికరాలను ఏర్పాటు చేయడం, ఆరోగ్యశ్రీలో ప్యాకేజీని పెంచడం, జబ్బుపై ప్రజల్లో అవగాహన కల్పించడం మంచిది. అలాగే ఈ వ్యాధికి వాడే ఇంజెక్షన్లు ఇతర జిల్లాల్లో లేవని తెలుస్తోంది. ఇక్కడ మాత్రం ఉన్నాయనే సమాధానం వస్తోంది. అదే నిజమైతే మంచిదే. ఆపద సమీపంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించడంలో తప్పులేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

కడపలోనే కొన్ని పరీక్షలు



ఈ వ్యాధి మన జిల్లాలో ఎక్కడా లేదు. ఇందుకు సంబంధించిన ఇంజెక్షన్‌లు.. మందులు అన్నీ సిద్ధంగా ఉన్నాయి. వ్యాధి నిర్ధారణకు కొన్ని పరీక్షలను కడప రిమ్స్‌లోనే చేస్తాం. మరికొన్ని పరీక్షలను పూణెలోని ల్యాబొరేటరీలో నిర్వహిస్తాం.

– డాక్టర్ రమాదేవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు

కడపలోని సన ఉల్లాహ్ మదరసాలో..



ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు మసీదులు భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం ఉపవాసదీక్షల విరమణ నిమిత్తం మసీదులకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అల్లాహ్ దీవెనతో ప్రపంచ మానవాళికి మేలు కలగాలని వారు ప్రార్థించారు.

– సీనియర్ ఫొటో గ్రాఫర్, సాక్షి, కడప

హార్సిలీహిల్స్ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుక

- 50 ఏళ్ల తర్వాత కలయిక
- వీరిలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు



గోల్డెన్ జూబ్లీ జరుపుకున్న పూర్వ విద్యార్థుల గ్రూప్‌ఫొటో

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఒకప్పుడు ఉన్న స్కూలులో చదువుకున్న విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఇదే హార్సిలీ హిల్స్‌పై ఆదివారం కలుసుకుని గోల్డెన్ జూబ్లీ వేడుకను ఉత్సాహంగా జరుపుకున్నారు. కొండపై గతంలో హార్సిలీహిల్స్ హైస్కూల్ ఉండేది. 1975లో పదో తరగతి కలిసి చదువుకున్న అప్పటి విద్యార్థులు..ప్రస్తుతం వివిధ రంగాల్లో, రాజకీయాల్లో ఉన్న వీరంతా సమావేశం నిర్వహించుకున్నారు. అప్పటి గురువులను స్మరించుకుని మృతిచెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తాము చట్టసభల్లో పని చేశామని, ఉన్నతాధికారులమన్న భావన లేకుండా ఒక్కటిగా కలిసి కొండపై సందడి చేశారు. కాలినడక ప్రకృతి అందాలను తిలకిస్తూ అప్పట్లో ఇక్కడ ఇలా ఉండేది..ఇప్పుడు ఇలా ఉంది అంటూ స్మృతులను నెమరేసుకున్నారు. సరదాగా క్రికెట్, ఇతరా క్రీడలు ఆడారు. చివర్లో పాత మిత్రులు కలిసి గ్రూప్‌ఫొటో దిగారు. ఈ పూర్వ విద్యార్థుల్లో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ రెడ్డి, విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ ఓంకార్, అనీషారెడ్డి, శ్రీనాథరెడ్డి, రాటకొండ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

జజ్జనకర.. జాతర



జాతరలో పాల్గొన్న అశేష భక్తజనం



విశేష అలంకరణలో గంగమ్మ దేవత

- ముగిసిన గంగమ్మ ఉత్సవం
- అశ్వవాహనంపై అమ్మవారి ఊరేగింపు
- భక్తజన సంద్రమైన అనంతపురం

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు కమనీయంగా జరిగిన వేడుకలు ఆదివారం ముగిశాయి. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసింది. అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు ఉత్సాహ భరితంగా జరిగింది. వివిధ రంగులతో కూడిన చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జబర్దస్త్ ఆర్కెస్ట్రా కార్యక్రమం అలరించింది. లక్కిరెడ్డిపల్లి జర్నలిస్టులు, మానవతా స్వచ్ఛంద సంస్థ, రాయచోటి మురళీ నవోదయ కోచింగ్ సెంటర్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంతో.. తాగునీటి దాహార్తి నుంచి ఉపశమనం కల్గింది. గంగ జాతర అంటే చెరుకులను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఉత్సవానికి వచ్చిన భక్తులు చెరుకులు లేనిదే తిరుగు ప్రయాణం చేయరు. మిఠాయి దుకాణాలు, శీతల పానీయాలు దుకాణాల వ్యాపారులు అధిక రేట్లు వసూలు చేసి సొమ్ము చేసుకున్నారు. బాణసంచా పేలుళ్లు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తుల రద్దీ భారీగా ఉండటంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. అమ్మవారి దర్శనం కోసం రూ.10, రూ.100, రూ.300 టికెట్లతోపాటు వీఐపీ దర్శనం ఏర్పాటు చేసినా.. గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. జిల్లాతోపాటు పొరుగు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి మొక్కులు ఉన్న వారు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. పలువురు ప్రముఖులు గంగమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ కుమార్, వెంకటేష్, గురుస్వామి, చంద్ర, రెడ్డి శేఖర్, బోస్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎద్దుల బండి

అపురూప ఘట్టం.. మహానైవేద్యం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వీరభద్రస్వామికి బంగారు కిరీటం, మూడో కన్ను ధరింప చేసిన వేదపండితులు



తేరుపై విహరిస్తున్న స్వామి వారు



ఆలయ ప్రాంగణంలో రాశిగా పోసిన అన్న ప్రసాదం వద్ద భక్తులు

రాయచోటిటౌన్: రాయచోటిలోని శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో అపురూప ఘట్టమైన మహానైవేద్యాన్ని వేదపండితులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఇదీ ప్రత్యేకత..

స్వామి వారికి రోజూ నైవేద్యం సమర్పిస్తారు. ఏడాదికి ఒకరోజు మహానైవేద్యం సమర్పిస్తారు. దీని కోసం స్వామికి రోజు వారి భత్యంలో భాగంగా ఒక సేరు బియ్యం చొప్పున 365 రోజులకు 365 సేర్లతో వండిన భోజనం, నెలకు ఒక సేరు బియ్యం ప్రకారం 12 నెలలకు 12 సేర్ల బియ్యంతో వండిన అత్తిరసాలు (నిప్పట్లు), వివిధ రకాల కూరగాయలతో వండిన వంటకాలతోపాటు పలు రకాల దుంపలు, గుమ్మడి కాయలు వండి రాశిగా పోస్తారు. ఈ వంటకాలను తెల్లవారుజామున మూడు గంటల నుంచే సుండుపల్లె మండలం శ్రీరామాపురానికి చెందిన భాస్కర్ కుటుంబ సభ్యులు తడిబట్టలతో మడికట్టుతో వండి సిద్ధం చేయడం పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ. వేదపండితులు ప్రణవానంద గిరి స్వామి (నర్రా వెంకట భాస్కర్ సిద్ధాంతి) శిష్యుడు శ్రీ మఠం ఓంకార్‌స్వామి ఆధ్వర్యంలో అన్నానికి పూజలు నిర్వహించాక తీసుకొచ్చి శ్రీ వీరభద్రస్వామి ఆలయం మధ్యలో రాశి పోశారు. అనంతరం వీరశైవులు, కన్నడ భక్తులు సిద్ధాంతి (వేదపండితుల) నుంచి అనుమతి తీసుకున్నాక కత్తులతో విన్యాసాలు చేస్తూ రాశిని కొల్లగొట్టారు. అనంతరం మట్లి వడియరాజులు రాశిలోకి దూసుకెళ్లి రెండు చేతులతో అందినంత తీసుకెళ్లారు. అనంతరం ప్రధాన అర్చకులు వేదపండితుల సహాయంతో స్వామివారికి బంగారు కిరీట ధారణ చేసి తినేత్రం(మూడోకన్ను) ధరింపచేశారు. స్వామివారి త్రినేత్రం అన్నం రాశిపై పడుతుందని, అప్పుడు ఒక్క క్షణంపాటు ప్రకంపనలు వస్తాయని భక్తుల నమ్మకం. ఆ సమయంలో స్వామి వారికి ఎదురుగా ఎవరూ ఉండకుండా జాగ్రత్త వహిస్తారు. ఆలయ సిబ్బంది పోలీసు అధికారుల సహకారంతో మహానైవేద్యాన్ని స్వామి వారి దర్శనం చేసుకొని వెళ్లే వారికి విస్తర్లలో పంచిపెడతారు.

- మహానైవేద్యం కొల్లగొట్టాక మిగిలిన ప్రసాదాన్ని కన్నడ భక్తులు తీసుకొచ్చి ఆలయం వెలుపల విస్తర్లలో ఎండపెట్టుకున్నారు. ఎండిన తర్వాత వడియాలుగా మార్చుకొని తీసుకెళతారు. ఉపవాసాలు ఉన్న రోజుల్లో వండిన ప్రసాదంలో కలుపుకొని తింటామని వారు చెప్పడం విశేషం. ఆదివారం తెల్లవారుజామున 4–30కు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం

శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా డప్పువాయిద్యాలు, కోలాటాలు, కర్ణాటక భక్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వీధు లన్నీ శ్రీ వీరభద్రుడి నామస్మరణతో మార్మోగాయి.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నాగరాజు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కొత్త బస్వాపురంలో తొర్రివేముల నాగరాజు (34) ఆదివారం సాయంత్రం వ్యవసాయ పొలం దగ్గర విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరాజు చేపల వేట చేస్తుంటాడు, వ్యవసాయ పొలం వద్ద పందుల నివారణ కోసం విద్యుత్ ఏర్పాటు చేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బి.మఠం పోలీసులు కేసు నమోదు చేశారు.

మోరీని ఢీకొన్న వాహనాలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు సమీపంలోని జాతీయ రహదారిపై సబ్ స్టేషన్ ఎదురుగా కడపకు వెళ్లే దారిలో రెండు ద్విచక్ర వాహనాలు మోరీని ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. ప్రొద్దుటూరుకు చెందిన మనోహర్, ప్రభావతి దంపతులతో పాటు వీర కుమార్ విజయలక్ష్మిలు కడప నగరంలో ఓ శుభకార్యానికి బయలుదేరారు. వీరి వెనుక అతివేగంగా వచ్చే వాహనాలకు భయపడి తమ ద్విచక్ర వాహనాలను కొంచెం పక్కకు తిప్పుకునే క్రమంలో మోరీని ఢీకొన్నారు. దీంతో మనోహర్ ప్రభావతి కింద పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. కాగా, వీరి వెనుకే వస్తున్న వీరకుమార్, విజయలక్ష్మి కూడా ఇదే మోరీని ఢీకొన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా అదే సమయంలో వెనుక నుంచి పలు వాహనాలు వేగంగా వీరి పక్కనే వెళ్లాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. మోరీని రోడ్డుపైన కట్టడమే ప్రమాదానికి కారణమని, గతంలో కూడా పలు ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

కడప అర్బన్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మలుపు వద్ద బైకుపై వెళుతున్న దినేష్ (35)అనే వ్యక్తిని ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహకారంతో ఆసుపత్రిలో చేరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గ్యాస్ లీకై వ్యక్తి మృతి

బి.కొత్తకోట : గ్యాస్ లీకైన సంఘటనలో తీవ్రంగా గాయపడిన స్థానిక ఖాజాఖాన్ వీధికి చెందిన లబ్బి అబ్దుల్ కరీం (65) బెంగళూరు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో స్నానానికి వెళ్లగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. స్నానాల గది నుంచి బయటకు రాగానే కుటుంబీకులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే శరీరం కాలిపోవడంతో వైద్యం కోసం కుటుంబీకులు బెంగళూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అధికారం అండతో ప్రభుత్వ స్థలం కబ్జా

- రెవెన్యూ రికార్డుల్లో నీటి మునకగా స్పష్టం
- దొంగ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్
- స్థలం తమదేనంటూ బోర్డు సైతం నాటిన వైనం
- చేష్టలుడిగి చూస్తున్న అధికారగణం

కడప సెవెన్‌రోడ్స్ : అధికార తెలుగుదేశం పార్టీ నేతల అండతో కడప నగరంలో కబ్జాదారులు పెట్రేగిపోతున్నారు. కుంట, వాగు, వంక, నీటిమునక ఇలా ప్రభుత్వ భూములన్నీ కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోతున్నాయి. కోట్లాది రూపాయలు విలువజేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైపోతున్నా నాయకుల ఒత్తిళ్లతో రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారు. కానాల జయలత అనే మహిళ చిన్నచౌకు గ్రామ సర్వే నెంబరు 955లోని 10 సెంట్ల ప్రభుత్వ స్థలం తమదేనంటూ ఏకంగా బోర్డు నాటినా ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం.

కడప కార్పొరేషన్ 43వ డివిజన్ నిరంజన్‌నగర్ పరిధిలో సర్వే నెంబరు 955లోని 23 సెంట్లు ప్రభుత్వ నీటి మునక భూమి ఉంది. మీ భూమి వెబ్‌సైట్‌లో ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ఇక్కడ ఒక సెంటు స్థలం రూ. 40 లక్షలు పలుకుతున్నట్లు తెలుస్తోంది. ఎంతో విలువైన స్థలం కావడంతో ఎలాగైనా కబ్జా చేసేందుకు ఎత్తులు వేశారు. ఇందులో భాగంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. కడప నగరం కుమ్మరకుంటకు చెందిన దాసరి సాల్మోన్‌కు 1953లో ప్రభుత్వం సదరు సర్వే నెంబరులోని 23 సెంట్ల పైకి 10 సెంట్లు పట్టాగా ఇచ్చారని డాక్యుమెంట్లలో పేర్కొన్నారు. వారసత్వరీత్యా ఆయన కోడలు దాసరి మేరమ్మకు ఆ స్థలం సంక్రమించినట్లు చూపారు. ఆమె తన అవసరాల నిమిత్తం మృత్యుంజయకుంటకు చెందిన కానాల జయలతకు రూ. 29,04,000లకు విక్రయించినట్లు చెబుతూ 2018 ఏప్రిల్ 4వ తేదీ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో ఆ స్థలాన్ని తాము కొనుగోలు చేసినట్లు, దానిపై తమకు సంపూర్ణ హక్కులు ఉన్నట్లు చెబుతూ కె.జయలత బోర్డు పాతారు. బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్–15–అండర్ సెక్షన్ 11 పేరా 2 ప్రకారం వాటర్ బాడీలు, వాటర్ కోర్సులు, కుంట పోరంబోకులను ఎవరికీ అసైన్‌మెంట్ లేదా అలియనేషన్ కింద దఖలు పరచరాదు. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. నీటి మునక, కుంట తదితర ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ ఇచ్చేందుకు, రీ క్లాసిఫికేషన్ చేసేందుకు అధికారం లేదని రాష్ట్ర హైకోర్టు కూడా గతంలో స్పష్టం చేసింది. 2012 సెప్టెంబరు 14వ తేదీన రెవెన్యూశాఖ ద్వారా జీఓ ఎంఎస్ నెంబరు 571 సైతం ప్రభుత్వం జారీ చేసింది. నీటి పోరంబోకు భూముల కన్వర్షన్, కేటాయింపుల విషయంలో తమ మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలంటూ సీసీఎల్ఏ కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాలు కూడా ఉన్నాయి. అయినా



ఈ భూమి తనదేనంటూ ప్రభుత్వ స్థలంలో జయలత పేరుతో ఏర్పాటైన బోర్డు

కూడా కె.జయలత 2018లో హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. అప్పటి కడప తహసీల్దార్ తరుపున కౌంటర్ అఫిడవిట్ దాఖలైంది. అది నీటి మునక ప్రాంతమని, దాన్ని రెవెన్యూ అధికారులు ఎవరికీ అసైన్ చేయలేదని కౌంటర్ అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. సదరు వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. వీఆర్‌ఓ ఇచ్చిన నివేదిక మేరకు చిన్నచౌకు సీఐ 2017 అక్టోబరు 1వ తేదీన దాసరి కొండయ్య, దాసరి చంద్రశేఖర్ అలియాస్ చందు, మరికొందరిపై ఎఫ్ఐఆర్ నెం. 262 నమోదు చేశారని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం కె.జయలత కౌంటర్ దాఖలు చేసుకోవచ్చని మాత్రమే చెప్పింది. అయినా ఆమె ఆ స్థలంలో ఓమారు బోర్డు పాతగా, రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతల అండ చూసుకుని ప్రభుత్వ బోర్డును తొలగించి ఆమె తన పేరిట ఒక బోర్డు పాతడం చర్చనీయాంశంగా మారింది.

రిజిస్ట్రేషన్ రద్దుకు ప్రతిపాదనలు – కడప తహసీల్దార్

ఈ అంశంపై కడప తహసీల్దార్ నారాయణరెడ్డిని సాక్షి వివరణ కోరగా.. చిన్నచౌకు పొలం సర్వే నెంబరు 955లోని 23 సెంట్ల భూమి ప్రభుత్వ నీటి మునక ప్రాంతం కింద ఉందని స్పష్టం చేశారు. గతంలో ఓమారు ఆమె బోర్డును పాతగా తొలగించామన్నారు. మళ్లీ ఇప్పుడు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఆమె చేసుకున్న రిజిస్ట్రేషన్ చెల్లదని స్పష్టం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వివరాలు సేకరించామన్నారు. ఆమె చేసుకున్న రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించామన్నారు. అప్పీలు చేసుకోవాలంటూ మాత్రమే వారికి కోర్టు సూచించింది తప్ప వారికి అనుకూలంగా ఎలాంటి తీర్పు ఇవ్వలేదన్నారు. బోర్డును తొలగించి రిజిస్ట్రేషన్ రద్దు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

యువకునిపై దాడి



గాయపడిన మణికంఠ

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లగొండు వారిపల్లె గ్రామ సమీపంలోని తోటల వద్ద మట్టిని తోల కూడదని చెప్పినందుకు మణికంఠ అనే యువకునిపై దాడి చేసి గాయ పరిచారు. బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మట్టిని అక్రమంగా తరలిస్తుంటే తరలించ వద్దని చెప్పినందుకు సాదావలీ, అక్బరమ్మలు అరటి కాయలు కోసే కొడవలితో దాడి చేశారు. దీంతో వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పులివెందుల ఆసుపత్రికి తరలించారు.

నలుగురు మట్కా నిర్వాహకుల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని దస్తగిరి పేటలో మట్కా నిర్వహిస్తున్న నలుగురిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో టూటౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో దస్తగిరిపేటకు చెందిన షేక్ నూరుద్దీన్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.70,250 నగదు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను భయపెట్టే చర్యలు

కడప కార్పొరేషన్ : డైవర్షన్ పాలిటిక్స్‌తోపాటు వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను భయాందోళనకు గురిచేసేందుకే పోసాని కృష్ణ మురళిని అరెస్ట్ చేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు, వల్లూరు మాజీ సర్పంచ్ బూసిపాటి కిషోర్ విమర్శించారు. ఆదివారం కడపలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోసాని కృష్ణ మురళి గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు కేసులు పెట్టడం, అరెస్టులు చూస్తుంటే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి సంబంధించిన కార్యకర్తలను, క్యాడర్‌ను భయాందోళనకు గురిచేసే ప్రణాళిక జరుగుతోందని అర్థమవుతోందన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం వల్లే తాను చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ పై మాట్లాడినట్లు పోసాని నేరాంగీకార పత్రంలో పేర్కొన్నట్లు చెబుతున్న తీరును చూస్తే పోలీసు వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఎంతగా వాడుకుంటుందో అర్థమవుతోందన్నారు. ఇదంతా జనసేన క్యాడర్‌ను అడ్డుపెట్టుకుని టీడీపీ ఆడుతున్న నాటకాలన్నారు.ఇలాంటి సంఘటనలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూసిపాటి కిషోర్

ఆటోలో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత

కడప అర్బన్ : ఆటోలో ల్యాప్‌టాప్ ఇతర విలువైన వస్తువులను మరిచిపోయి దిగిన బాధితునికి పోలీసులు తిరిగి వాటిని అందజేశారు. వివరాలిలా.. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మురళి తన సొంత పనిమీద కడపకు వచ్చాడు. అప్సర సర్కిల్ వద్ద ఆటో దిగే సమయంలో తన ల్యాప్‌టాప్ ఇతర విలువైన వస్తువులు ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయి దిగి వెళ్లిపోయాడు. తర్వాత ఆ విషయాన్ని గుర్తించి చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆటో వచ్చిన మార్గంలోని వివిధ చోట్ల ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ఖాదర్ లు పరిశీలించి ఆటోను గుర్తించాడు. బాధితుడు కోల్పోయిన బ్యాగు, ల్యాప్‌టాప్, వాచ్ ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని బాధితుడికి అందించారు. పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. అధికారుల ఆదేశాలతో తక్షణం స్పందించిన కానిస్టేబుళ్లను చిన్న చౌకు పోలీస్ స్టేషన్ సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర రెడ్డి, రవి కుమార్, సిబ్బంది ప్రశంసించారు.



ల్యాప్‌టాప్‌ను అప్పగిస్తున్న పోలీసులు

ప్రజలను బలి చేసిన బడ్జెట్ ఇది

- అబద్ధాలు, మోసాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనులు చేయవద్దని సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి అనడం దారుణం
- వీళ్లను చొక్కాపట్టుకొని నిలదీసే రోజు వస్తుంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం రూ.3.24 లక్షల కోట్లతో ప్రవేశపెట్టింది బాహుబలి బడ్జెట్ కాదని...ప్రజలను బలిచేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్ధాలు, మోసాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని మరోసారి నిరూపితం అయిందన్నారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు 143 హామీలు మేనిఫెస్టోలో చెప్పి ప్రజల్ని మోసం చేశాడన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పాడని, ఎక్కడ సృష్టించాడో, ఏ విధంగా సృష్టించాడో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ నేతలకు మాత్రమే సంపద సృష్టి జరిగిందని, కింది స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకూ వారి స్వలాభానికే సంపద సృష్టి జరిగిందన్నారు. గత నవంబర్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పింఛన్లతో మమ అనిపించాడని, ఈ ఏడాది బడ్జెట్‌లో ఆ పింఛన్లలో కూడా కోత విధించేలా ఉన్నారన్నారు. పింఛన్లకు రూ.4వేల కోట్లు తక్కువగా కేటాయింపులు చేశారని, సుమారు 10 లక్షల పింఛన్లు కోత కోసేందుకు సర్వేలు వాయు వేగంతో చేస్తున్నారన్నారు. ఆడబిడ్డ నిధి అని 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని గొప్పలు చెప్పారని, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేకుండా చేశారన్నారు.

తల్లికి వందనం పథకానికి సంబంధించి 80 లక్షల మంది పిల్లలకు 12వేల కోట్లు కావాల్సి ఉంటే...9వేల కోట్లే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. ఆ రూ. 9వేల కోట్లయినా సరైన విధంగా ఇస్తాడా... అనే అనుమానం ఉందన్నారు. అన్నదాత సుఖీభవకు కేంద్రం ఇచ్చే రూ.6వేలు కాకుండా అదనంగా రూ. 20 వేలు ఇస్తానని ఇప్పుడు మార్చారన్నారు. చంద్రబాబు చేష్టలకు ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందన్నారు. 2024 నవంబర్ బడ్జెట్‌లో వ్యాల్యూమ్–6లో రూ.6.46 కోట్ల అప్పులు చూపారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగిపోయే నాటికి రూ.3.16లక్షల కోట్లు అప్పు ఉండేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో వ్యాల్యూమ్–6 కాలమ్‌నే తొలగించారని ఎత్తి చూపారు. ఈ 9 మాసాలకే రూ. 1.30 లక్షల కోట్ల అప్పు చేశాడని, వచ్చే ఏడాది మరో లక్ష కోట్ల అప్పు చేస్తారని బడ్జెట్ ద్వారా అర్థమవుతోందన్నారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమకుగానీ, గాలేరు నగరి, హంద్రీనీవా, అన్నమయ్య ప్రాజెక్టులకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ ముగ్గురూ కలిసి ఇవే హామీలను ప్రజలకు చెప్పారన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 30వేల కోట్ల బకాయిలను పట్టించుకోలేదని, పీఆర్సీ గురించి చర్చే లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం కోసం అప్పులు చేశారని, ఈ ప్రభుత్వం అవేమీ చేయకుండానే రూ.1.30 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ వారికి చిన్న పని చేసినా ఊరుకోను అంటూ ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడటం దారుణమన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్ కులం, మతం, వర్గం లేదు..పార్టీ అంతకన్నా లేదని అందరికీ సంక్షేమాన్ని అందించారన్నారు. చివరికి ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా రూ.8వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేశారన్నారు. పోసాని కృష్ణమురళి ఎప్పుడో 2021లో మాట్లాడితే.. ఇప్పుడు తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని, అంతకు ముందు టీడీపీ నేతలు ఎన్ని బండ బూతులు తిట్టారో మేము చూపిస్తామన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వీళ్లను చొక్కాపట్టుకొని నిలదీసే రోజు త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, నాగేంద్రారెడ్డి, ఎస్ఎండీ షఫీ, శ్రీరంజన్‌రెడ్డి, సాయి, సాయిదత్త పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

గన్నే నీకు ఇది తగునా..!

- దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు
- సాగుచేసుకుంటున్న భూముల్లోకి రానివ్వకుండా బెదిరింపులు
- గన్నే సుబ్బనరసయ్యనాయుడు దౌర్జన్యాలపై దళితుల నిరసన
- మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు



గన్నే సుబ్బరాయుడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజంపేట టౌన్ : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు తమకు చెందిన భూముల్లో సాగుచేసుకుంటున్న పంట పొలాల్లోకి రానివ్వకుండా ఇతరుల ద్వారా బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని కొల్లావారిపల్లె మిట్టదళితవాడకు చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత దళితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం వారి పంట పొలాల వద్ద గన్నే సుబ్బనరసయ్యనాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూ లబ్ధిపొందిన వారి కుటుంబాలకు చెందిన జయరామయ్య, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడారు. రాజంపేట మండలం గోపమాంబపురం రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 20/24లో 1.50 ఎకరాల భూమిని 2023వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మన్నెం లక్షుమ్మకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఇచ్చిందన్నారు. ఈభూమి గతంలో లక్షుమ్మ అవ్వ గంగమ్మ పేరిట ఉండేదన్నారు. అలాగే 20/25 సర్వే నంబర్‌లోని 1.50 ఎకరాల భూమి కొట్టం దుర్గాకు, 20/26 సర్వే నంబర్‌లోని 50 సెంట్ల భూమిని మన్నెం పద్మకు ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఇచ్చిందని తెలిపారు. దీంతో తమ భార్యల పేరిట ఉన్న ఈ భూముల్లో తాము పంటలు పెట్టి సాగుచేసుకుంటుండగా గన్నే సుబ్బనరసయ్యనాయుడు అండతో చవన పీరయ్యనాయుడు తమ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని తమను భూముల్లోకి రానివ్వడం లేదని వారు ఆరోపించారు. 2023వ సంవత్సరంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా తమకు కేటాయించిన భూములకు విద్యుత్‌శాఖ అధికారులు పీరయ్యనాయుడు పేరుతో విద్యుత్ కనెక్షన్‌ను ఇచ్చారని, ఈవిషయాన్ని తాము గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు పీరయ్యనాయుడు పేరిట ఉన్న కనెక్షన్‌ను తొలగించారని తెలిపారు. అయితే మళ్లీ అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకుల వత్తిళ్లకు తలొగ్గి పీరయ్యనాయుడుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారన్నారు. దీంతో గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పీరయ్యనాయుడులు తాము సాగుచేసుకుంటున్న పంట పొలాల్లోకి అడుగు కూడా పెట్టనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము తమ భూముల్లోకి వెళితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అలాగే తనపై ఆరోపణలు చేస్తే భారీ మూల్యం కూడా చెల్లించుకోవాల్సి ఉంటుందని గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఇతరుల ద్వారా తమకు హెచ్చరికలు పంపుతున్నట్లు వారు తెలిపారు. సుబ్బనరసయ్యనాయుడు మేకవారిపల్లెలోని వంకపోరంబోకును ఆక్రమించుకొని షెడ్డు నిర్మించుకున్నాడని, అలాగే మిట్టమీదపల్లె మిట్టహరిజనవాడకు చెందిన గుడిసె సుబ్బరాయుడు, శెట్టిపల్లె నరసింహులు, కొండయ్య, మిట్టమీదపల్లెలోని సోమిగారి కుటుంబానికి చెందిన ఐదు ఎకరాల ఉరవడి చేనుకు గన్నే సుబ్బనరసయ్యనాయుడు దొంగపట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నట్లు వారు ఆరోపించారు. గన్నే సుబ్బనరసయ్యనాయుడు రాజంపేట మండలంలో అనేకచోట్ల భూ ఆక్రమణలకు పాల్పడ్డాడని, వాటన్నింటిని కూడా తాము సర్వే నెంబర్లతో సహా వెలుగులోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు.

గంగ జాతరలో ఏరులై పారిన మద్యం

- విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు
- భక్తుల జేబులకు చిల్లులు
- పట్టించుకోని అధికారులు

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మ జాతరలో మద్యం దుకాణాలు వెలిశాయి. బాటిల్‌పై రూ. 50 నుంచి రూ. 100 అదనంగా వసూలు చేసి మద్యం దుకాణదారులు లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఇదంతా జరుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. మద్యం దుకాణాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా జాతరలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి భక్తులను దండుకున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే పేకాట క్లబ్బులు, స్లో బాల్ ఆటలను ఏర్పాటు చేసుకొని భక్తుల జేబులకు చిల్లులు వేశారు. ఇదంతా జాతర బయట జరగలేదు. జాతర మధ్యలో సందడిగా ఉన్న ప్రాంతంలో పేకాట క్లబ్బులు జరిగాయి. లక్షలాది రూపాయలు భక్తుల నుంచి దోచుకున్నారు. అడిగే నాథుడే లేకపోవడంతో రంగులరాట్నం, మిఠాయి దుకాణాలు మొదలుకొని చెరుకుల గడల వరకు దోచుకున్న వారికి దోచుకున్నంత అన్న చందంగా అధికంగా వసూలు చేసుకొని వ్యాపాలు కొనసాగించారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించారు.



జాతరలో అధిక ధరలతో జరుగుతున్న మద్యం విక్రయాలు



జాతరలో అనుమతులు లేకున్నానే ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బీర్ బాటిళ్లు



జూదం నిర్వహిస్తున్న దృశ్యం

ద్విచక్ర వాహనానికి నిప్పు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఈశ్వరరెడ్డినగర్‌లో ఫైనాన్స్ వ్యాపారికి చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వరరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ప్రతి రోజు అతని బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేసేవాడు. శనివారం రాత్రి బైక్‌ను ఎప్పటిలాగే ఇంటి బయట నిలిపాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. శ్రీనివాసులు శనివారం మండల కేంద్రమైన దువ్వూరులో పలువురితో గొడవ పడ్డాడు. గొడవ పడిన వ్యక్తులే బైక్‌కు నిప్పు పెట్టి ఉంటారని అతను భావిస్తున్నాడు. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిన బైక్

కొనసాగుతున్న పశువైద్య విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు రూరల్ : మండల పరిధి గోపవరం గ్రామ సమీపంలోని పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరసన దీక్షలు 28 రోజుకు చేరాయి. వారు ఆదివారం మోకాళ్లపై నిలుచొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు స్టైఫండ్ పెంచాలని పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు దీక్షలను ఆపేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం తమకు ఇస్తున్న రూ.7 వేల స్టైఫండ్ ప్రస్తుతం పెరిగిన ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలని కోరారు.



మోకాళ్లపై నిలుచొని నిరసన తెలుపుతున్న పశువైద్య విద్యార్థులు